# వేతనాల కోసం వినూత్న నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్13 : వేతనాలు ఇవ్వాలని జిల్లా కేంద్రంలోని సామాజిక దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సామాజిక దవాఖాన ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతినెలా 5వ తేదీలోగా జీతాలు అందేలా చూడాలని, ఏడు నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు మల్లేశ్, మురళీ, సత్తార్, మమత పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రంభీం ఆసిఫాబాద్

5 | శనివారం 14 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# మెరుగైన వైద్యమందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 13 : బస్తీ దవాఖానల్లో మెరుగైన వైద్యమందించాలని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.హరీశ్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ, ఆరోగ్య మహిళా కార్యక్రమం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆరోగ్య, ఐఈసీ అవగాహన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీదవాఖాన వైద్యురాలు రమ్య, స్టాఫ్ నర్సు వెంకటసాయి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసులు


ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న


నిర్మల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, లోలం శ్యాంసుందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

# బీఆర్ఎస్‌పై నిర్బంధకాండ

**హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

- గురువారం రాత్రి నుంచే లీడర్ల ముందస్తు అరెస్టులు
- ఇళ్లల్లోకి చొచ్చుకొచ్చి పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- మాజీ మంత్రి జోగురామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గృహనిర్బంధం
- కాంగ్రెస్‌ది నియంతృత్వ పాలన అంటూ ఫైర్



భీమారం పోలీస్ స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జన్నారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


నస్పూర్‌లో పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ యూత్ నాయకులు

మంచిర్యాల, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో కాంగ్రెస్ గూం డారాజ్ మొదలైంది. కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌పై నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన నేపథ్యం లో శుక్రవారం హైదరాబాద్‌లో నిరసనకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునివ్వగా, పోలీసులు గురువారం రా త్రి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందుస్తుగా అరెస్టులు చేశారు. ఇళ్లలోకి చొచ్చుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మం త్రి జోగురామన్నను పోలీసులు హౌజ్ అరె స్టు చేశారు. శుక్రవారం ఉదయం రామన్న దగ్గరికి వెళ్లిన పోలీసులు ఇల్లు వదిలి బయటికి రావొద్దని సూచించా రు. మధ్యా హ్నం హైదరాబాద్ బయలుదేరేందుకు సిద్ధమైన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను సైతం పోలీసులు నిర్బంధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డిని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాలో నస్పూర్, బెల్లంపల్లి, కోటపల్లి, భీమారం మండల కేంద్రాలతో పాటు నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, కడెం, పెంబి, కుంటాల మండలాలు సహా ఆదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లి, ఉట్నూర్, తాంసి, నార్నూర్, తలమడుగు, బేల, సిరికొండ, బోథ్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందుస్తుగా అరెస్టు చేయగా, తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు నిరసనలు తెలిపే స్వాతంత్ర్యం లేకుండా పోయిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్‌కు భయమని, అందుకే మా పార్టీ కార్యకర్తలను హైదరాబాద్‌కు రాకుండా అడ్డుకున్నదన్నారు. పోలీసులను ప్రత్యేకంగా మోహరించి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి, మాజీ మంత్రుల అక్రమ అరెస్టులపై కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేయడంపై తెలంగాణ సమాజం మండిపడుతున్నది.


ఆదిలాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీమంత్రి జోగు రామన్న

## రాష్ట్రంలో రౌడీరాజ్యం



కాంగ్రెస్ సర్కారు బీఆర్ఎస్‌కు భయపడి మా శ్రేణులను అరెస్ట్‌లు చేయిస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ రౌడీలతో దాడులు చేయిస్తున్నది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం శాంతియుతంగా ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే శాంతిభద్రతలు అదుపుతప్పాయి. అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. ఓటుకు నోటు కేసులు పట్ట పగలు దొరికిన దొంగ సీఎం రేవంత్ రెడ్డికి రౌడీయిజం అలవాటే. కౌశిక్‌రెడ్డి ఇంటిపై ముఖ్యమంత్రి కాంగ్రెస్ రౌడీలను పంపి దాడి చేయించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు చక్కగా ఉంటే పెట్టుబడులు వచ్చి యువతకు ఉపాధి లభిస్తుంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, రైతుభరోసా, పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నది.

*- జోగు రామన్న, మాజీమంత్రి*

## సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే దాడులు



కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడుల పాలన గా మారింది. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, ఆయన అనుచరులు చేసిన దాడిని ఖండిస్తున్నాం. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణం. హైదరాబాద్‌కు నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయి. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన ముఖ్యమంత్రి అల్లర్లు సృష్టిస్తున్నారు.

*- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే*

## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



ఖానాపూర్, సెప్టెంబర్ 13: ప్రజా పాలన ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారు. దాడికి పాల్పడిన అరికపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదు. బీఆర్ఎస్ నేతలంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు వణుకు పడుతుంది. ? దాడి చేసిన వారిని వీడిచి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం సిగ్గుచేటు. సీఎం ప్రోద్బలంతో జరుగుతున్న అక్రమ విధానాలను ప్రజలు గ్రహిస్తున్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదు.

*-ఖానాపూర్ బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్ నాయక్*

# బ్యాడ్మింటన్ సంచలనం సహస్ర

- జాతీయస్థాయిలో రాణిస్తున్న మంచిర్యాల అమ్మాయి
- నేటి నుంచి కోల్‌కతాలో జరిగే పోటీల్లో సత్తాచాటేందుకు సన్నద్ధం



కోచ్ వికాస్ హర్షతో సహస్ర

మంచిర్యాల, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కందికట్ల సహస్ర బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ సంచలనాలు సృష్టిస్తోంది. బ్యాడ్మింటన్‌పై ఇష్టంతో 8 ఏళ్ల ప్రాయంలోనే ప్రాక్టిస్ మొదలుపెట్టింది. కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు మధుకుమార్-స్రవంతి ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లల గోపిచంద్ శిష్యుల్లో ఒకరైనా నేషనల్ ప్లేయర్ వికాస్ హర్ష దగ్గర కోచింగ్ ఇప్పించారు. నాచారంలోని ఎంకేఎస్ బ్యాడ్మింటన్ అకాడమీలో 2020 నుంచి ట్రైనింగ్ తీసుకుంటున్న సహస్ర జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది. 11 ఏళ్ల వయసులోనే అండర్-13 జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైంది. అండర్-11లో యోనెన్స్ సన్‌రైజ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. గతేడాది 2023 లో జరిగిన ఆలిండియా ఓపెన్ టోర్నమెంట్ గెలుచుకొని, గోల్డ్ మెడల్ సాధించింది. అనంతరం నిర్వహించిన యూపీ ఛాంపియన్‌షిప్ ఓపెన్‌లో సిల్వర్, నమ్మ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్, పీఎస్ఎం జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లలో గోల్డ్ మెడల్స్ గెలుచుకుంది. ఇటీవల పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పోటీల కోసం నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటింది. అండర్-13లో జాతీయ స్థాయిలో 20 ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. నేటి నుంచి (సెప్టెంబర్ 13) నుంచి 19వ తేదీ వరకు కోల్‌కతాలో జరిగే నేషనల్స్‌లో పాల్గొననున్నది. దేశవ్యాప్తంగా టాప్-25 మందికి ఎంట్రీ కల్పించగా, ఇందులో సహస్ర ఒకరు. దేశవ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో సత్తా చాటేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారుల అసోసియేషన్ సభ్యులు సహస్ర ఈ మెగా టోర్నీలో రాణించాలని ఆకాంక్షిస్తున్నారు.


పోషణ్ అభియాన్ గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# వేడుకలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 13 : ఈ నెల 17న తెలంగాణ పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేడుకలు విజయవంతం చేయాలన్నారు.

### పోషణ మాసమును పకడ్బందీగా నిర్వహించాలి

పోషణ మాసమును పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్, పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మానసిక, శారీరక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు అవసరమైన మందులు అందించాలన్నారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు ఆహారం అందించాలని, మెనూ పట్టికను బోర్డుపై ప్రదర్శించాలని, మండల, జిల్లా అధికారులు తరచూ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శామ్-మామ్ కార్యక్రమంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని వారి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అనంతరం పోషణ్ అభియాన్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# చెరువులకు హద్దులు ఏర్పాటు చేయండి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**


బొట్ల కుంట చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 13 : ప్రతి చెరువుకూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను గుర్తించి మార్కింగ్ చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవా రం మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల, లక్షెట్టిపేట, బొట్లకుంట చెరువులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని ఆదేశాలు జారీ చేశారు. చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగించాలన్నారు. చెరువు విస్తీర్ణం గుర్తించి పూర్తి వివరాలు తెలియజేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కోరారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఇరిగేషన్ డీఈ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ గేట్ ముందు నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

# కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 13 : సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే సమ్మెకు దిగుతామని మున్సిపాలిటీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవతరించిదన్నారు. సిబ్బందికి పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలని, ఇతర మున్సిపాలిటీల్లో మాదిరిగానే కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాట్ల రాజు, కార్యదర్శి తోట సమ్మయ్య, కోశాధికారి ఇగురపు బాపురావ్, నాయకులు లక్ష్మి, పద్మ, సిడం మోతీదాం, ఇస్తారి, సాగర్, శ్రీనివాస్, బాలేశ్ పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679